
నేటి మ్యాచ్ | రాజస్థాన్ X పంజాబ్ | గువాహటి - రా. 7.30

# మనికా @24

**టాప్-25 ర్యాంకింగ్స్‌లో చోటు • భారత టేబుల్ టెన్నిస్ చరిత్రలో ప్రథమం**



ఢిల్లీ: ఇటీవలే ముగిసిన సౌదీ స్మాష్ టోర్నమెంట్‌లో సంచలన ప్రదర్శనలతో మెరిసిన భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ప్లేయర్ మనికా బాత్ర మరో ఘనత సాధించింది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటీటీఎఫ్) మంగళవారం తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఆమె 24వ ర్యాంకుకు దూసుకెళ్లింది. భారత్ తరఫున సింగిల్స్ కేటగిరీలో ఒక ప్యాడ్లర్ టాప్-25లో చోటు దక్కించుకోవడం ఇదే ప్రథమం. 2022లో మనికా.. మహిళల డబుల్స్‌లో అర్చనా కామత్‌తో కలిసి 4వ ర్యాంకుకు చేరుకోగా తాజాగా సింగిల్స్‌లో ఆమె అత్యుత్తమ ర్యాంకు పొందడం విశేషం. సౌదీ స్మాష్ టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ మన్యు (చైనా), 14వ ర్యాంకర్ నినా మిత్తెల్హామ్ (జర్మనీ)ని ఓడించి క్వార్టర్స్ చేరడం ఆమెకు కలిసొచ్చింది. దీంతో మనికా ఏకంగా 15 ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని 24వ ర్యాంకు సాధించింది. తెలంగాణ అమ్మాయి శ్రీజ ఆకుల మూడు ర్యాంక్‌లు కోల్పోయి 41వ ర్యాంకులో నిలిచింది.

## హెచ్‌సీఏ ఎథిక్స్ అధికారిగా జస్టిస్ ఈశ్వరయ్య



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఎథిక్స్ అధికారిగా ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఎన్‌సీబీసీ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో జస్టిస్ ఈశ్వరయ్యకు హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, ఇతర పాలకవర్గ సభ్యులు స్వాగతం పలికారు. సంవత్సరం పాటు పదవిలో కొనసాగనున్న ఆయనను సభ్యులకు, ఇతర అధికారులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు, కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## భారత చీఫ్ కోచ్ పదవికి ఆహ్వానం

**దరఖాస్తులకు బీసీసీఐ నోటిఫికేషన్**

న్యూఢిల్లీ: భారత ప్రధాన కోచ్ పదవి కోసం బీసీసీఐ మంగళవారం దరఖాస్తులను ఆహ్వానించింది. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌తో ప్రస్తుత చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో రానున్న మూడున్నరేండ్లకు కోచ్ కోసం బీసీసీఐ కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27 ఆఖరి తేదీగా ప్రకటించింది. 'చీఫ్ కోచ్ ఎంపిక ప్రక్రియలో దరఖాస్తులను పూర్తిగా పరిశీలిస్తాం. ఆ తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూలు చేసి తుది జాబితాను వెల్లడిస్తాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. 60 ఏండ్ల లోపు ఉండి జాతీయ జట్టు తరఫున 30 టెస్టులు లేదా 50 వన్డేలు, రెండేండ్ల పాటు కోచ్‌గా అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా బోర్డు పేర్కొంది.

## విజేతలుగా మనూ, విజయ్‌వీర్

**25 మీటర్ల షూటింగ్ ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్**



భోపాల్: స్టార్ షూటర్ మనూ భాకర్, పురుషుల విభాగంలో విజయ్‌వీర్ సిద్ధూ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో విజేతలుగా నిలిచారు. భోపాల్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్‌లో భాగంగా మహిళల విభాగంలో మనూ 586 స్కోరు చేసి స్వర్ణం గెలవగా సిమ్రన్ ప్రీత్, అభిధ్న్య తదుపరి స్థానాల్లో నిలిచారు. పారిస్ బెర్తును ఖరారు చేసుకున్న హైదరాబాదీ షూటర్ ఇషాసింగ్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. పురుషుల కేటగిరీలో విజయ్‌వీర్ స్వర్ణం నెగ్గగా అనీష్, ఆదర్శ్ సింగ్ రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు. బుధవారం పురుషుల, మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో సెలక్షన్స్ జరుగనున్నాయి.

# ఢిల్లీ పోతూ పోతూ

**లక్నోను కొంప ముంచిన క్యాపిటల్స్ • పొరెల్, స్టబ్స్ విధ్వంసంతో భారీ స్కోరు • పూరన్, అర్షద్ పోరాటం వృథా**



స్టబ్స్ (57*, 1/4)

**ఐపీఎల్-17లో తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడిన ఢిల్లీ క్యాపిటల్స్.. పోతూ పోతూ లక్నో సూపర్ జెయింట్స్‌ను కూడా వెంట తీసుకెళ్లింది. గత ఆదివారమే బెంగళూరుతో మ్యాచ్‌లో ఓడి ప్లేఆఫ్స్ రేసునుంచి అనధికారికంగా తప్పుకున్న క్యాపిటల్స్.. మంగళవారం రాత్రి అరుణ్ జైట్లీ స్టేడియంలో లక్నో అవకాశాలపైనా దెబ్బకొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీకి పొరెల్, స్టబ్స్ మెరుపులతో భారీ స్కోరు అందించగా బౌలింగ్‌లో ఇషాంత్ పేస్‌కు లక్నో టాపార్డర్ దాసోహమంది. పూరన్, అర్షద్ పోరాడినా లక్నోకు ఓటమి తప్పలేదు. లక్నో ఓటమితో కోల్‌కతా తర్వాత రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్ బెర్తును దక్కించుకుంది.**



ఇషాంత్ (3/34)

ఢిల్లీ: ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అనధికారికంగా తప్పుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ పోతూ పోతూ ఎక్కడో మిణుకుమిణుకుమంటున్న లక్నో నాకౌట్ ఆశలపైనా నీళ్లు చల్లింది. మంగళవారం తమ చివరి మ్యాచ్‌లో ఢిల్లీ.. లక్నోను 19 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత క్యాపిటల్స్.. పొరెల్ (58), స్టబ్స్ (25 బంతుల్లో 57, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) వీరవిహారం చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 208/4 పరుగులు చేసింది. ఛేదనలో లక్నో 20 ఓవర్లలో 189/9 పరుగులకు పరిమితమైంది. పూరన్ (27 బంతుల్లో 61, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు మెరిపించగా ఆఖర్లో అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 58 నాటౌట్,3 ఫోర్లు, 5 సిక్సర్లు) పోరాడాడు. ఇషాంత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**పొరెల్, స్టబ్స్ విధ్వంసం..**

ఈ సీజన్‌లో ప్రత్యర్థి బౌలర్లపై చిచ్చరపిడుగులా విరుచుకుపడుతున్నఫ్రేజర్ ఇన్నింగ్స్ రెండో బంతికే డకౌట్ అయినా మరో ఓపెనర్ పొరెల్.. షై హోప్ ( 38) ఢిల్లీ స్కోరుబోర్డును ఉరకలెత్తించాడు. అర్షద్ ఖాన్ 3వ ఓవర్లో పొరెల్ 4,4,6,4 తో రెచ్చిపోగా యుధ్‌వీర్ 4వ ఓవర్లో హోప్ 4,4,6 బాదాడు. ఇదే ఊపులో పొరెల్ 21 బంతల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా సాగుతున్న ఢిల్లీ ఇన్నింగ్స్‌లో బిష్ణోయ్ అడ్డుకట్ట వేశాడు. హోప్‌ను బిష్ణోయ్ ఔట్ చేయగా పొరెల్‌ను నవీన్ పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన స్టబ్స్.. పంత్ (33)తో ఢిల్లీకి ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడే క్రమంలో పంత్ నిష్క్రమించినా అర్షద్ ఖాన్, నవీన్ ఉల్‌హక్ ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకుపడ్డ స్టబ్స్ 22 బంతుల్లోనే 50 పూర్తిచేసి ఢిల్లీకి భారీ స్కోరును అందించాడు.

**ఇషాంత్ దెబ్బకు విలవిల..**

లక్ష్య ఛేదనలో లక్నోకు తొలి ఓవర్ నుంచే కష్టాలు చుట్టుముట్టాయి. ఇషాంత్ శర్మ వరుస ఓవర్లలో లక్నోకు షాకుల మీద షాకులిచ్చాడు. మొదటి ఓవర్లోనే కెప్టెన్ రాహుల్ (5) ఇచ్చిన క్యాచ్‌ను స్వీపర్ కవర్ వద్ద ముకేశ్ ఒడిసిపట్టాడు. అతడే వేసిన 3వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన డికాక్ (12).. ఐదో బంతికి మిడాన్ వద్ద ముకేశ్ చేతికి చిక్కాడు. స్టోయినిస్ రాగానే అక్షర్‌కు బంతినిచ్చిన పంత్.. ఫలితాన్ని రాబట్టాడు. ఇషాంత్ 5వ ఓవర్లో దీపక్ హుడాను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

**ఆదుకున్న పూరన్..**

ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో పూరన్ మాత్రం రెచ్చిపోయాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీ లైన్ దాటించాడు. అక్షర్ 4వ ఓవర్లో 4,6,4,6 దంచినా.. పూరన్ 20 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. కృనాల్ (18) తో కలిసి ఆరో వికెట్‌కు 30 పరుగులు జోడించిన పూరన్‌ను ముకేశ్ ఔట్ చేయడంతో లక్నో ఆశలు ఆవిరయ్యాయి. ఆఖర్లో అర్షద్ పోరాడినా ఆ జట్టు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది.

### సంక్షిప్త స్కోర్లు

**ఢిల్లీ:** 20 ఓవర్లలో 208/4 (పొరెల్ 58, స్టబ్స్ 57, నవీన్ 2/51, బిష్ణోయ్ 1/26) . **లక్నో:** 20 ఓవర్లలో 189/9 (పూరన్ 61, అర్షద్ 58 నాటౌట్, ఇషాంత్ 3/34, స్టబ్స్ 1/4)

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ఫ.తే. | ర | పా |
|---|---|---|---|---|---|---|
| కోల్‌కతా ✓ | 13 | 9 | 3 | 1 | 1.42 | 19 |
| రాజస్థాన్ ✓ | 12 | 8 | 4 | | 0.34 | 16 |
| చెన్నై | 13 | 7 | 6 | | 0.52 | 14 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | | 0.40 | 14 |
| ఢిల్లీ | 14 | 7 | 7 | | -0.37 | 14 |
| బెంగళూరు | 13 | 6 | 7 | | 0.38 | 12 |
| లక్నో | 13 | 6 | 7 | | -0.78 | 12 |
| గుజరాత్ X | 13 | 5 | 7 | 1 | -1.06 | 11 |
| ముంబై X | 13 | 4 | 9 | | -0.27 | 8 |
| పంజాబ్ X | 12 | 4 | 8 | | -0.42 | 8 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు ఫ.తే. : ఫలితం తేలనివి.

## గోయెంకా, రాహుల్ అలయ్ బలయ్!




న్యూఢిల్లీ: లక్నో సూపర్‌జెయింట్స్ ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా ఒక మెట్టు దిగాడు. లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో వ్యవహరించిన తీరు వివాదాస్పదమైన నేపథ్యంలో స్నేహపూర్వకంగా భేటీ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు ముందు సోమవారం గోయెంకా తన నివాసంలో రాహుల్‌ను ప్రత్యేక విందుకు ఆహ్వానించాడు. రాహుల్‌కు స్వాగతం పలుకుతూ ఆత్మీయంగా కౌగిలించుకున్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దీనికి తోడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో షాయ్ హోప్ ఇచ్చిన క్యాచ్‌ను డైవ్ చేస్తూ రాహుల్ పట్టిన క్యాచ్‌ను గోయెంకా లేచి నిలబడి చప్పట్లతో అభినందించాడు. ఇదిలా ఉంటే సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో గత మ్యాచ్‌లో భారీ ఓటమి తర్వాత విచక్షణ కోల్పోయిన గోయెంకా..అందరూ చూస్తుండగానే రాహుల్‌ను కడిగిపడేశాడు. దీనిపై అటు క్రికెట్ అభిమానులతో పాటు మాజీ క్రికెటర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫ్రాంచైజీ యజమాని అయినంతా మాత్రాన ఒక ప్లేయర్‌తో పబ్లిక్ వ్యవహరించే తీరు ఇదేనా అంటూ సోషల్‌మీడియాలో గోయెంకాపై దుమ్మెత్తిపోసిన సంగతి తెలిసిందే.

## సెమీస్‌కు గౌరవ్



అస్తానా: ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ గౌరవ్ చౌహా న్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి పతకం ఖాయం చేశాడు. మంగళవారం 92 కిలోల విభాగంలో పోటీపడ్డ గౌరవ్.. 3-2 తేడాతో డేనియల్ సపర్‌బె (కజకిస్థాన్)తో పోరాడి గెలిచాడు. కానీ ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ విజేత శివ తాపా (63.5 కిలోలు) 1-4తో అబ్దుల్ అల్మత్ (కజకిస్థాన్) చేతిలో ఓడగా సంజయ్ (80 కిలోలు) కూడా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

## తజిందర్‌కు స్వర్ణం



భువనేశ్వర్: జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో షాట్‌పుటర్ తజిందర్‌పాల్‌సింగ్ తూర్ పసిడి పతకంతో మెరిశాడు. మంగళవారం జరిగిన పురుషుల షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ ఇనుపగుండును 20.38మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఇది తన వ్యక్తిగత మార్క్(21.77మీ)తో పాటు ఒలింపిక్ క్వాలిఫయింగ్(21.50మీ) కంటే తక్కువ కావడం విశేషం. మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌లో జెస్విన్ ఆల్డ్రిన్ 7.99మీటర్ల దూరంతో స్వర్ణం ఖాతాలో వేసుకున్నాడు.

## 'టాప్స్'లోకి స్క్వాష్ ప్లేయర్లు

ఢిల్లీ: భారత యువ స్క్వాష్ ప్లేయర్లు అనాహత్ సింగ్, అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్‌కుమార్ టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)లోకి వచ్చారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టనున్న ఈ క్రీడలో పతకాల వేటకు ప్రణాళికలు రచిస్తున్న కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ.. ముగ్గురు స్క్వాష్ ప్లేయర్లను టాప్స్‌లో చేర్చింది. 16 ఏండ్ల అనాహత్ ప్రస్తుతం నేషనల్ చాంపియన్ కాగా ఆసియా అండర్ -17 చాంపియన్, రెండు పీఎస్ఏ వరల్డ్ టూర్ టైటిల్స్ నెగ్గింది

---

**వాణిజ్య**



### టీవీఎస్ మరో మూడు ఈ-స్కూటర్లు

**ప్రారంభ ధర రూ.94,999**


చెన్నై, మే 14: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్..మార్కెట్లోకి ఒకేసారి మూడు ఎలక్ట్రిక్ స్కూటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఐక్యూబ్ పోర్ట్‌ఫోలియో వీటిని ప్రవేశపెట్టింది. ఈ బైకు ప్రారంభ ధర రూ.94,999గా నిర్ణయించింది. జూన్ 30వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 2.2 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ గంటకు 75 కిలోమీటర్ల వేగంతో 75 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 3.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 100 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. గంటకు 78 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ మాడల్‌ను రూ.1,55,555కి విక్రయించనున్నది. 5.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 118 కి పైగా ఫీచర్స్ కలిగిన ఈ స్కూటర్ 4.18 గంటల్లో 80 శాతం వరకు బ్యాటరీ రీచార్జికానున్నది. గంటకు 82 కిలోమీటర్ల వేగం కలిగిన ఈ మాడల్ ధర రూ.1,85,373గా నిర్ణయించింది.

### 34 వేల కోట్ల మోసం కేసులో డీహెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్ అరెస్ట్

న్యూఢిల్లీ, మే 14: పలు బ్యాంకుల వద్ద వేలాది కోట్ల రూపాయలు తీసుకొని ఎగ్గొట్టిన కేసులో డీహెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్ ధీరజ్ వాద్వాన్‌ను అరెస్ట్ చేసింది సీబీఐ. బ్యాంకుల కన్సార్షియం వద్ద రూ.34 వేల కోట్ల రుణం తీసుకొని ఎగ్గొట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో వాద్వాన్‌ను ముంబైలో సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్న సీబీఐ..మంగళవారం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది. ఈ కేసులో 2022లోనే సీబీఐ చార్జిషీట్‌ను దాఖలు చేసింది.

# కష్టజీవిపై ధరల కత్తి

- మార్కెట్‌లో మంట పుట్టిస్తున్న నిత్యావసరాలు
- పెరిగిన కూరగాయలు, ఉల్లి రేట్లు
- తలకిందులవుతున్న వంటింటి బడ్జెట్
- పేద, మధ్యతరగతి వర్గాల జేబులకు చిల్లులు
- గత నెల రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 8.70 శాతం
- 13 నెలల గరిష్ఠానికి టోకు ధరల సూచీ



***సుకుమార్ ఓ మధ్యతరగతి ప్రైవేట్ ఉద్యోగి. నెలకు రూ.30,000 జీతం. ఏడాది కిందట రూ.3,000తో కిరాణా, కూరగాయల ఖర్చు తీరిపోయేది. కానీ ఇప్పుడు రూ.5,000 పెట్టాల్సి వస్తున్నది. చివరకు ఓసారి భార్యాభర్తల మధ్య గొడవలకూ ఇది దారితీసింది. ఆదాయం పెరగలేదు కానీ.. ఖర్చులు పెరిగాయి మరి. ఇదొక్క సుకుమార్ ఇంట్లోనే కాదు.. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి. మార్కెట్‌లో రోజుకో తీరున మారుతున్న ధరలతో ఇప్పుడు సామాన్యులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఏడాది వ్యవధిలో 5 శాతానికిపైగా ఎగిసి గత నెలలో 8.70 శాతాన్ని చేరింది. అంగట్లో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ.. ఇలా ఏ కూరగాయల రేట్లైనా మండిపోతున్నాయిప్పుడు. పప్పు దినుసుల సంగతి సరేసరి. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల వంటింటి బడ్జెట్ తలకిందులైపోయింది.***

**ధరల పెరుగుదల ఇదీ.. (రూ.లలో)**

| ఉత్పత్తి (కిలోల్లో) | ఏప్రిల్ 2023 | ఏప్రిల్ 2024 |
|---|---|---|
| కందిపప్పు | 110-125 | 140-160 |
| మినపపప్పు | 100-110 | 125-140 |
| పెసరపప్పు | 110-120 | 135-150 |
| శనగపప్పు | 65-70 | 80-90 |
| పల్లీలు | 105-115 | 130-140 |
| బెండకాయ | 25-30 | 50-60 |
| దొండకాయ | 20-25 | 40-50 |
| పచ్చిమిర్చి | 40-50 | 70-80 |
| ఆలుగడ్డ | 25-30 | 40-50 |

న్యూఢిల్లీ, మే 14: కొనబోతే కొరివే అన్నట్టు తయారైంది సగటు మనిషి బతుకు. కడుపునిండా కూడు లేక చాలీచాలని మెతుకులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నది సామాన్యులకు. ఆదాయం అంతంతే ఉంటున్నదిగానీ.. ఖర్చులు అంతకంతకూ పెరిగిపోతున్నాయి మరి. వస్తువు ఏదైనా, ఉత్పత్తి ఏమైనా చూసి ఉసూరుమనడమే తప్ప.. కొని అక్కెర తీర్చుకునే అవకాశం లేక పేద, మధ్యతరగతి వర్గాలు కాలం వెళ్లదీస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పుట్టిస్తున్న మంటలకు.. మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ద్రవ్యోల్బణం అధికారిక గణాంకాలే నిదర్శనం. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు (డబ్ల్యూపీఐ) ఏకంగా 13 నెలల గరిష్ఠాన్ని తాకుతూ గత నెల ఏప్రిల్‌లో 1.26 శాతంగా నమోదయ్యాయి. ఈ క్రమంలోనే రిటైల్ మార్కెట్‌లోనూ ఆహార ధరలు 8.70 శాతాన్ని చేరాయి. నిజానికి గత ఏడాది ఏప్రిల్‌లో 3.84 శాతంగానే ఉండటం గమనార్హం. ఇక నిరుడు ఏప్రిల్‌లో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 0.79 శాతంగా ఉన్నది. టోకు ఆహార ద్రవ్యోల్బణం 4 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 7.74 శాతంగా ఉన్నది.

**ఎండలు ఇలాగే ఉంటే..**

ఈసారి ఎండలు దంచి కొడుతున్న విషయం తెలిసిందే. అయితే పెరుగుతున్న ఎండల తీవ్రత ఆయా ఆహార పంటలపై పెద్దగానే ప్రభావం చూపుతున్నది. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక మార్కెట్‌లో ధరలకు రెక్కలు తొడుగుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది మార్చితో చూస్తే కూరగాయల ధరలు ఏప్రిల్‌లో 19.52 శాతం నుంచి 23.60 శాతానికి పెరిగాయి. ఆలుగడ్డ ధర 52.96 శాతం నుంచి 71.97 శాతానికి ఎగిసింది. ఉల్లిగడ్డ ధర 56.99 శాతం నుంచి 59.75 శాతం ఎగబాకింది.


**ముందుచూపేది..**

ద్రవ్యోల్బణం వెనుక కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత్.. వర్షాధార పంటల దేశం. వర్షాలు ఏటా సమృద్ధిగా పడవు. కాబట్టి మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఆయా ఉత్పత్తుల నిల్వల్ని ఎప్పుడూ ఉంచాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల ధరలు స్థిరంగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. నిల్వలు లేకనే నిత్యావసరాలు, ముఖ్యంగా మెజారిటీ పప్పు దినుసుల కిలో ధర సగటున రూ.150 పలుకుతున్నదని పేర్కొంటున్నారు. నిరుడు జూలై, ఆగస్టు నెలల్లోనూ ఆహార ద్రవ్యోల్బణం 15.09 శాతం, 11.43 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నారు. ఈ వర్షాకాలంలో నిరాశే ఎదురైతే ధరల కట్టడి కష్టంగానే ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

### ఈసారీ వడ్డీరేట్లు ఎక్కడివక్కడే!

*ద్రవ్యోల్బణం తాజా గణాంకాల నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వచ్చే నెల నిర్వహించబోయే ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లు యథాతథంగానే ఉంటాయన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే దాదాపు ఏడాదిన్నరగా రెపోరేటు జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ మానిటరీ పాలసీలను ముగించేస్తున్నది. కరోనా టైంతో పోల్చితే ఇప్పుడు వడ్డీరేట్లు చాలా ఎక్కువగా ఉన్నది తెలిసిందే. దీంతో అటు వ్యాపార, పారిశ్రామిక రంగాలు, ఇటు సామాన్య ప్రజానీకం వడ్డీరేట్లను తగ్గించాలని మొత్తుకుంటున్నా.. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్న ఆర్బీఐ మాత్రం దిగిరావడం లేదు. ఈ క్రమంలో ఆహార ద్రవ్యోల్బణం విజృంభణ.. మరోమారు ఆర్బీఐ వడ్డీరేట్ల కోతకు అడ్డం పడేలా ఉన్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జూన్ 5-7 తేదీల్లో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ చేపట్టనున్నది.*

> ***మార్కెట్‌లో చాలా వస్తూత్పత్తుల ధరలు గత కొద్దినెలలుగా పెరుగుతూపోతున్నాయి. దీన్నిబట్టి మే, జూన్ నెలల్లో డబ్ల్యూపీఐ సూచీ 2 శాతాన్ని దాటేలా ఉన్నది. దీనివల్ల దేశ స్థూల ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితం అవుతుంది.***
> ***-అదితీ నాయర్, ఐసీఆర్ఏ ప్రధాన ఆర్థికవేత్త***



# బీజేపీకి భంగపాటు!

- **ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సర్కారు గెలుపు సులువేం కాదు**
- **ఇండియా వీఐఎక్స్ పెరుగుదల దేనికి సంకేతం**

న్యూఢిల్లీ, మే 14: ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపు అంత సులువు కాదా?.. ఓడిపోయే వీలుందా?.. గతంతో పోల్చితే ఈసారి మోదీ సర్కారుకు మెజారిటీ బాగా తగ్గుతుందా?.. ఇండియా వీఐఎక్స్ (భారతీయ స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకుల సూచీ) పెరుగుదలను చూస్తే ఇప్పుడీ ప్రశ్నలే తలెత్తుతున్నాయి. మంగళవారం 52 వారాల గరిష్ఠాన్ని తాకుతూ ఇండియా వీఐఎక్స్ 21.88కి చేరింది. ఏప్రిల్ 23న ఇది 10.20గానే ఉండటం గమనార్హం. ఇక గత నెల రోజుల్లో దాదాపు 67 శాతం పెరిగింది. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మదుపరులలో నెలకొన్న అనుమానాలు, ఆందోళనలకు ఇండియా వీఐఎక్స్ అద్దం పడుతున్నదని మెజారిటీ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**300 సీట్లకు దిగువనే..**

ఇండియా వీఐఎక్స్ పెరుగుదలలో మీడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ వృద్ధి కూడా కీలకపాత్ర పోషిస్తుందని చెప్తున్న మార్కెట్ నిపుణులు.. గత 20 రోజులుగా మాత్రం సూచీ పెరుగుదలకు ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 300లలోపు ఎంపీ సీట్లే రావచ్చన్న అంచనాలే కారణమని స్పష్టం చేస్తున్నారు. ఇదే జరిగితే దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోకి జారుకుంటాయని, ఒడిదొడుకులు, ఆటుపోట్లు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. అందుకే వీఐఎక్స్ సూచీ అంతలా పెరుగుతూపోతున్నదని అభిప్రాయపడుతున్నారు. 'గత మూడు వారాలుగా బీజేపీ ప్రభుత్వంపట్ల ప్రజల్లో కొంత వ్యతిరేకత పెరిగినట్టు కనిపిస్తున్నది. దీన్నిబట్టి బీజేపీకి ఈ దఫా 280-300 సీట్లు వస్తాయనిపిస్తున్నది. అయితే 290 కంటే సీట్లు తగ్గితే భారతీయ స్టాక్ మార్కెట్లకు ఆ ఫలితం తప్పక ప్రతికూలమే అవుతుంది' అని పేస్ 360 సహవ్యవస్థాపకుడు, ప్రధాన గ్లోబల్ వ్యూహకర్త అమిత్ గోయల్ అన్నారు.

## ఎఫ్‌ఐఐల్లో టెన్షన్..టెన్షన్

***4 వేల కోట్ల షేర్లను అమ్మేసిన విదేశీ మదుపరులు***

ముంబై, మే 14: విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ సర్కార్‌కు మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని అంచనాలు వెల్లడికావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌ఐఐలు భారీ స్థాయిలో తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. తాజాగా మంగళవారం రూ.4 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఎక్స్చేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా రూ.9,988. 34 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసిన ఎఫ్‌ఐఐలు.. రూ.14,054 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. నికరంగా రూ. 4,065.66 కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. మొత్తంగా ఈ ఏడాది ఎఫ్‌ఐఐలు రూ.1,17,788 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

**డీఐఐల జోరు**

ఒకవైపు ఎఫ్‌ఐఐలు అమ్మకాలకు మొగ్గు చూపితే.. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం ఈక్విటీ మార్కెట్లలోకి నిధులు కుమ్మరిస్తున్నారు. రూ.11,455 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, రూ.7,927 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. నికరంగా వీరు రూ.3,528 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అయింది. అలాగే డీఐఐలు ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1,79,122 కోట్ల విలువైన షేర్లను కొనుగోళ్లు చేశారు. మరోవైపు, మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 73,104 పాయింట్లకు చేరుకోగా, నిఫ్టీ 114 పాయింట్లు అందుకొని 22,218 పాయింట్లకు చేరుకున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.